క్లుప్తంగా

వందే భారత్ రైలుకు స్వాగతం



వందే భారత్ రైలుకు స్వాగతం పలికిన రాజకీయ నాయకులు, అధికారులు, ప్రయాణికులు

సామర్లకోట: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణానికి కొత్తగా వేసిన రెండో వందే భారత్ రైలుకు మంగళవారం సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప కొబ్బరికాయ కొట్టారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు రైలు బోగిలలోనికి ఎక్కి పరిశీలించారు. ఈ రైలుకు సామర్లకోటలో హాల్ట్ ఇవ్వడంపై ఎంపీ గీత ఒక ప్రకటనలో రైల్వే మంత్రికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు, రైల్వే అధికారులు దేవేంద్ర స్వామి, ఎవీకె సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సిద్ధంకండి



విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న రామారెడ్డి

సామర్లకోట: పదో తరగతి పరీక్షలకు ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని విద్యాశాఖ ఏఎంఓ ఎంవీ రామారెడ్డి అన్నారు. మంగళవారం అయోధ్యరామపురం మున్సిపల్‌లో పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విద్యాశాఖ సూచించిన ప్రణాళికలు అమలు చేయడం ద్వారా విజయాలు సాదించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. గోవిందు, కె.అరుణ, కేవీవీ సత్యనారాయణ, వి.రాజు, ఏఎల్‌వీ కుమారి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా మురళీకృష్ణ



కొత్తపల్లి: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా డీవీ మురళీకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కాకినాడ కలెక్టరేట్‌లో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం.శ్రీనివాసరావు కాజులూరు డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ చౌదరి

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కేఆర్‌కే చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్నసేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, ఉపాధ్యాయులు ఎంఎల్ శివజ్యోతి, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు అందజేసిన పాగా సురేష్, కౌన్సిలర్లు హరిబాబు, పాప

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో 31 వార్డులకు సంబంధించి 5,200 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో వాటిని లబ్ధిదారులకు అందజేస్తున్నారు. సోమవారం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి వీటిని ప్రారంభించగా ఆయా వార్డుల కౌన్సిలర్లు సచివాలయాల్లో రిజిస్టర్డ్ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా సచివాలయాలల్లో అధికార పార్టీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ పట్టణ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఏడో సచివాలయంలో 270 ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

పదింతల ప్రణాళికతో సన్నద్ధం

- 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- చక్కటి కార్యాచరణతో సిద్ధమవుతున్న విద్యార్థులు
- 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయులు
- మెరుగైన ఫలితాల సాధనకు సూచనలు, సలహాలు



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు, పాఠశాలల వివరాలు

మండలం	విద్యార్థులు	పాఠశాలలు
కొత్తపల్లి	886	11
పిఠాపురం	1132	16
గొల్లప్రోలు	754	07

పరీక్షల షెడ్యూల్ ఇలా...
ఏప్రిల్ 18 లాంగ్వేజ్–1, 19న లాంగ్వేజ్–2, 20న ఇంగ్లిషు,
22న గణితం, 23న ఫిజికల్ సైన్స్, 26న బయోలాజికల్ సైన్స్,
27న సామాజిక అధ్యయనాలు

కొత్తపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించడం కష్టమేమీ కాదంటున్నారు సబ్జెక్ట్ నిపుణులు. పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో సబ్జెక్టు నిపుణులు సూచిస్తున్నారు. ఆ దిశగా ముందుకు సాగితే మంచి మార్కులు సాధించవచ్చని ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు తెలిపారు.

ఇష్టంగా చదివితే..
పదో తరగతి విద్యార్థులు పాఠాలను కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఏకాగ్రతతో చదవాలని, సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. రోజువారీ ప్రణాళిక వేసుకుని చదవాలి. బట్టీ పట్టకుండా ప్రతి పాఠాన్ని విశ్లేషణతో చదివితే సులువుగా అర్థం కావడంతో పాటు ఎక్కువ కాలం గుర్తుంటుందని చెబుతున్నారు. ఒత్తిడి వీడి ఆరోగ్యంపై సైతం దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

రైటింగ్ స్కిల్‌పై పట్టు సాధించాలి



ఇంగ్లిష్ సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థుల్లోని సృజనాత్మకతను రైటింగ్ స్కిల్‌తో పరీక్షస్తారు. లెటర్ రైటింగ్, కాన్వర్సేషన్, డైరీ, ఎడిటర్ లెటర్, బ్రయోగ్రాఫికల్ స్కెచ్, ఫ్రేమింగ్ డబ్ల్యూహెచ్ ప్రశ్నలు తదితర అంశాలపై ప్రశ్నలు ఇస్తారు. ఇచ్చిన గ్రాఫ్ లేదా చార్ట్‌కి పేరాగ్రాఫ్ రాయాలి. వీటి పై పట్టు సాధిస్తే సులభంగా 30 మార్కులు వస్తాయి.
పద్మజ, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, కొత్తపల్లి

గణితంలో సాధనతో మంచి మార్కులు



గణితంలో 1, 2, 4 మార్కుల పశ్నలకు చాయిస్ ఉండదన్న విషయాన్ని విద్యార్థులు గమనించాలి. 8 మార్కుల ప్రశ్నలకు మాత్రమే చాయిస్ ఉంటుంది. ప్రస్తుత విధానంలో ఇస్తున్న ప్రశ్నపత్రం ఎ, బి గ్రేడ్ విద్యార్థులు అధిక మార్కులు పొందేందుకు, సి, డి గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి అనువుగా ఉంది. ఎ, బి గ్రేడ్ విద్యార్థులు 95కు పైగా మార్కులు సాధించాలంటే 4, 8 మార్కుల ప్రశ్నలపై దృష్టి సారించాలి. బాగా సాధన చేయాలి.
వీర్రాజు, గణిత ఉపాధ్యాయుడు, కొత్తపల్లి

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పదో తరగతిలోని ఈ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నాం. 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం.
రమణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు, కొత్తపల్లి

తాగునీటి ఎద్దడికి సత్వర చర్యలు



జె.తిమ్మాపురంలో బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ

పెద్దాపురం: మండలంలోని మెట్ట గ్రామాల్లో దాహార్తిని తీర్చేందుకు సత్వర చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ పెంకే సత్యవతి అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురంలో మంచినీటి సమస్యను మంగళవారం ఎంపీడీఓ ఉషారాణి, ఈఓపీఆర్డీ కె.రాజశేఖర్‌లతో కలిసి పరిశీలించారు. ఎంపీపీ సత్యవతి మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామంలో బోర్‌వెల్‌ను పరిశీలించారు. నీటి పారుదల శాఖ ఏఈ అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి సుభానీ, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ పరీక్షకు 13 మంది గైర్హాజరు

కొత్తపల్లి: వీవీఎస్ విద్యాసంస్థల కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 252 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 239 మంది హాజరయ్యారు.

ఒక స్టేషన్–ఒక స్టాల్‌ను సద్వినియోగం చేసుకోండి

- ఎంపీ వంగా గీత
- రైల్వే స్టేషన్‌లో చేతివృత్తుల స్టాల్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత

సామర్లకోట: 'ఒక స్టేషన్ – ఒక స్టాల్' కార్యక్రమంలో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చేతివృత్తుల స్టాల్‌ను కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుకు రూ.100 అద్దె చెల్లించే పద్ధతిలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను అందరూ వినియోగించుకోవాలన్నారు. చేతి వృత్తిదారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి రైల్వే స్టేషన్ ఆవరణలోను ఈ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తారని ఆమె చెప్పారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌ను రూ.25 కోట్లతో అభివృద్ధి చేయడానికి రైల్వే బోర్డు అంగీకరించడంతో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో ఆటోమెటిక్ సిగ్నల్ వ్యవస్థ కార్యాలయం , స్టేషన్ మేనేజరు కార్యాలయం, ప్రయాణికుల విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు, రెండో కాలిబాట వంతెన, ఎస్కలేటర్, ప్లాటుఫారాలపై షెడ్ల పొడగింపు వంటి పనులు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అధ్యక్షత వహించగా అదనపు డివిజనల్ మెటీరియల్ మేనేజరు దేవేంద్ర స్వామి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ సూపరింటెండెంట్ బి. శ్రీధర్, సీనియర్ సెక్షన్ ఇంజినీరు (టెలికం) నారాయణరావు తదితరులతో పాటు, బీజేపీ నాయకులు సుంకవిల్లి బాపిరాజు, వల్లూరి బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో పాశుపతాస్త్రం వైఎస్సార్ సీపీ

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



వాకతిప్పలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఆనాల సుదర్శన్



పిఠాపురంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



చిన జగ్గంపేటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ నాగలోవరాజు తదితరులు

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా మారి ప్రజల తరఫున పోరాడుతున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జగ్గంపేటలో మార్చి 12వ తేదీన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని ప్రారంభించారని, అప్పటి నుంచి ప్రజల పక్షాన పోరాడుతూ, ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా మారిందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీయే అన్నారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అభిమానులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు, గండేపల్లి బాబీ, ఆనాల సుదర్శన్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సానా నాగు, బాలిపల్లి రాంబాబు, పలువురు నేతలు, కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ నేత వమ్మి మల్లికార్జున్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, అరిగెల రామయ్యదొర తదితరులు పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ కన్వీనర్ దాసం వెంకటేష్, పార్టీ నేతలు కడింశెట్టి కుమార బాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ బత్తిన మంగ, ఎంపీటీసీలు గాది అప్పారావు, ఆకుల శ్రీను, వెలుగుల సత్యనారాయణ, కందా బాబ్జి, పినకా కూటన్న తదితరులు పాల్గొన్నారు. పిఠాపురం మండలంలో పలువురు పార్టీ నేతల ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వాకతిప్పలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి, కేక్‌ను కట్ చేశారు. తొలుత దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, రాష్ట్ర యువజన కార్యదర్శి సాన నాగు, సర్పంచ్ పాలని దొరబాబు, గవర నాగేశ్వరరావు, గింజల శ్రీనివాస్, గోపి హరిబాబు, రాపర్తి శ్రీను, లొల్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



కుతుకుడుమిల్లిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న నేతలు



కుతుకుడుమిల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు అన్నారు. వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామ సచివాలయాల్లో మంగళవారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసిన ఇళ్ల పట్టాలను సర్పంచ్‌లు పాలాని దొరబాబు, కర్రి చిన్నారావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రావు చిన్నారావు మాట్లాడుతూ కుల,మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ, అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందించారని చెప్పారు.

వలంటీర్లకు సత్కారం
గ్రామాల్లో వలంటీర్లు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం వలంటీర్లకు సత్కారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వలంటీర్లు వారధులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కుతుకుడుమిల్లి ఎంపీటీసీ రాయుడు విష్ణు, దాకే రాజ్‌కుమార్, రెవెన్యూ అధికారులు చంద్రశేఖర్, గంగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాత ఇసుకపల్లిలో..
కొత్తపల్లి: ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను పాత ఇసుకపల్లి సచివాలయంలో సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఎరకం నూకారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు గుళ్లపల్లి వీరభద్రరావు, సచివాలయ కన్వీనర్ ఎరకం వెంకట దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడమ తిప్పని నేత జగన్



ఆనూరులో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్న సూరిబాబు

పెద్దాపురం: మాట ఇస్తే మడమ తిప్పని వ్యక్తి సీఎం జగన్ అని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. ఆనూరు గ్రామంలో మంగళవారం అందరికీ ఇళ్లు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, పార్టీ నాయకులు సింగన త్రిమూర్తులు, కూనపురెడ్డి స్వామితో కలిసి పంపిణీ చేశారు. సర్పంచ్ అనితారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని నేతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని, అదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన వచ్చేలా లబ్ధిదారులందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని సూరిబాబు కోరారు. కార్యక్రమంలో నరేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దుర్గాడలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



విశేషాలంకరణలో రామలింగేశ్వర స్వామి



ఉత్సవానికి హాజరైన భక్తులు

పిఠాపురం: మహా శివరాత్రి సందర్భంగా ఆది దేవుడి వార్షిక కల్యాణాలు భక్తులను పరవశింపజేశాయి. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉన్న రామలింగేశ్వరుని త్రిశూల స్నానం, శ్రీపుష్పోత్సవం కనీవిని ఎరుగని రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి ఈ ఉత్సవాలు ముగిశాయి.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడిని సామర్లకోట సీహెచ్‌సీకి తరలించిన స్థానికులు

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని మున్సిపల్ సెంటర్‌లో వాహనం ఢీ కొని మంగళవారం ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం తోటవారి వీధికి చెందిన దువ్వా సుబ్రహ్మణ్యం తాపీ పని చేసుకొని ఇంటి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో కాలికి తీవ్ర గాయమైంది. స్థానికులు క్షత గాత్రుడిని 108లో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరం

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రాంతంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైల్వేలో పోస్టులను భర్తీ చేయాలి

తుని: రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ కార్యదర్శి ఎం.లీల డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రైల్వే కల్యాణ మంటపంలో ఎస్ఆర్ఎంయూ సర్వసభ్య సమావేశం సంఘ డివిజన్ అధ్యక్షుడు ఎస్.రామగుప్తా ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లీల మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

జగన్ కోసం అన్నవరానికి పాదయాత్ర

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుతూ కృష్ణునిపాలెం పంచాయతీ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు అన్నవరం వరకూ పాదయాత్ర చేపట్టారు. పార్టీ నాయకుడు నందూరి గంగాధరరావు ఆధ్వర్యంలో ఆయన కుమారులు సీతారాం, సాయిరాం మంగళవారం ఉదయం కాలనీ నుంచి ఈ పాదయాత్ర ప్రారంభించారు. గంగాధరరావు మాట్లాడుతూ ఐదేళ్ల పాటు జనరంజక పాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దాం



మేం సిద్ధం.. మా బూత్ సిద్ధంపై ప్రచారం నిర్వహిస్తున్న వైస్ చైర్మన్లు

పెద్దాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దామని, దానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అన్నారు. మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తొమ్మిదో సచివాలయం పరిధిలో 16, 17వ వార్డుల్లో ఓటర్లను కలసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రజాకర్షక పథకాలతో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలంటే పుర ప్రజలందరూ వైఎస్సార్ సీపీకి ఓటు వెయ్యాలన్నారు. నియోజవకర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి ప్రజలకు అందిన సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, తాడి రాజశేఖర్, వాసంశెట్టి గంగ, బషీర్, అధిక సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రి జగనే



ఆనూరులో మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. తొలుత గ్రామంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, పలువురు నాయకుల విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సూరిబాబు మాట్లాడుతూ రానున్న కాలంలోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడడం తథ్యమన్నారు. మరో నాలుగు దఫాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తారనిన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ నాయకుల సమక్షంలో భారీ కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ భద్రరావు, సొసైటీ అధ్యక్షుడు పల్లా గంగారావు, లక్కాకుల కృష్ణ, గంటా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ రక్ష



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి అన్నారు. నాగులపల్లి గ్రామ సచివాలయం–2 పరిధిలో ఎంపీపీ పాఠశాల వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో 371 మందికి పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి పల్లెలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య నిపుణులతో గ్రామాల్లో సేవలు అందిస్తున్నారని చెప్పారు. శిబిరంలో పరిష్కారం కాని రోగాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపిస్తారని తెలిపారు. వైద్యారోగ్య, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.